ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శనివారం | 06 జూన్, 2026 | పేజీలు :08

## అడవులను రక్షించుకోవాలి: కలెక్టర్




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కొవడానికి అడవులను రక్షించుకోవడం ఒక్కటే మార్గమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడ బీట్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్‌లతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను బతికించుకునేలా అధికారులు, ప్రజలు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. అడవుల రక్షణకు పోలీస్ శాఖ తరపున పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ నీరోష, అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ఐడిఎస్‌ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం



**ప్రజాపక్షం/కరీంనగర్:** నగర ప్రజలకు మరిన్ని ఆధునిక వసతులు కల్పించడంలో భాగంగా కరీంనగర్ నగరంలో నూతనంగా అధునీకరించిన ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. కరీంనగర్ నగరపాలక సంస్థకు చెందిన కాంప్లెక్స్ భవనాన్ని శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ సుడా కు చెందిన 79 లక్షల నిధులతో 48 షాపులుగా అధునీకరించిన ఐడీఎస్‌ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ను శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు వడ్లూరు లక్ష్మణ్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, స్థానిక శాసనసభ్యులు గంగుల కమలాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ నరెంధర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వనీ తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ప్రారంభం చేశారు. అనంతరం సుడాకు చెందిన 1.28 కోట్ల రూపాయల నిధులతో నైట్ ఫుడ్ కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం కు శంఖు స్థాపన చేశారు. నైట్ ఫుడ్ కోర్ట్ కాంప్లెక్స్ స్టాల్స్ నిర్మాణంతో పాటు పార్కింగ్ స్థలం, బెంచెస్ ఏర్పాటు, పిల్లల ఆట పరికరాలు, వాటర్ ఫౌంటెన్ లాంటి వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. అనంతరం రాజీవ్ చౌక్ లో ఏర్పాటు చేసిన మాజీ భారత ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ కాంస్యవిగురహాన్ని పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రారంబించారు. అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో ఆధునిక టెక్నాలజీని పరిచయం చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేషం, మున్నూరు కాపు కార్పోరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సయ్య, స్థానిక కార్పోరేటర్ వంగల పవన్, (మాజీ మేయర్) కార్పోరేటర్ రవీంధర్ సింగ్, కార్పోరేటర్లు వైద్యుల అంజన్ కుమార్, వరాల నర్సింగం చాడగొండ కవిత బుచ్చిరెడ్డి, సరిల్ల రాజకుమారి ప్రసాద్, అలీ, మల్లేషం, నగరపాలక సంస్థ, సుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



కలెక్టర్ సత్యప్రసాద్

**ప్రజాపక్షం/జగిత్యాల:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పేర్కొన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణ కేంద్రంలోని గన్ పార్క్‌లో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూపర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కలెక్టర్ సూచించారు.పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్న కలెక్టర్, మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్,జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్,కౌన్సిలర్ ప్రశాంత్ రావు,తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్ మధ్యలో మొక్కలు నాటండి

కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) జంక్షన్ సుందరీకరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) జంక్షన్ లో సిరిసిల్ల మున్సిపల్ ఆద్వర్యంలో జంక్షన్ సుందరీకరణ, జోట, వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలకు సంబంధించిన విగ్రహాలు, గ్రీనరీ, మొక్కల ఏర్పాటు పనులు కొనసాగుతుండగా, శుక్రవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలకు చెందిన విగ్రహాలు ఏర్పాటు చేయగా. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అధికారులను అభినందించారు. జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన డివైడర్ల మధ్యలో మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ సూచించారు. త్వరితగతిన అన్ని సుందరీకరణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలనలో మున్సిపల్ కమీషనర్ ఖదీర్ పాషా, సిరిసిల్ల తహసీల్దార్ మహేష్, డీఈ వాణి, తదితరులు ఉన్నారు.



# పర్యావరణ దినోత్సవం సందర్భంగా సీడ్‌బాల్స్ పంపిణీ

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పండ్ల మొక్కలను నాటి స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టి పర్యావరణ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆచార్యులు విద్యార్థులకు సూచించారు. ఒక్క విద్యార్థి ఒక్క మొక్క అనే నినాదంతో స్థానిక అంబేద్కర్ స్టేడియంలో సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో ఈ సీడ్‌బాల్స్ ను ఖాళీ ప్రదేశాల్లో వేయడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చని ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రధాన అంశం క్లైమేట్ యాక్షన్ నౌ ఫర్ క్లైమేట్ అని పేర్కొంటూ భూమిని రక్షించేదుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పర్యావరణ పరిరక్షణ వ్యక్తిగత బాధ్యతగా భావించి మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని ప్రధానోపాధ్యయులు మోర రణధీర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డా.చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, డివైఎస్‌వో ఉట్కూరు శ్రీనివాస్ గౌడ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెల్దండి దామోదర్ బైరి శ్రీనివాస్, రాంచంద్రారెడ్డి, సంపత్, సూర శివశంకర్, నాగరాజు,పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు, పర్యావరణ ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు.

## ఖేతీ బచావో అభియాన్ అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ముత్తారం :** రైతులు అధిక రసాయన ఎరువులు,పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి,నేల ఆరోగ్యాన్ని కాపాడాలని కె.వి.కె రామగిరి శాస్త్రవేత్త వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. ముత్తారం మండలంలోని హరిపురం గ్రామంలో ఖేతీ బచావో అభియాన్ వ్యవసాయాన్ని రక్షించండి అనే కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త వినోద్ కుమార్ మాట్లాడుతూ, విచక్షణారహితంగా మందులు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందని హెచ్చరించారు. భూమి ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ, రాబోయే వానాకాలంలో తుఫానుల వల్ల వచ్చే వాతావరణ మార్పులను తట్టుకునేందుకు వీలుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. నీటి వసతి ఉన్న రైతులు వరి సాగు చేయాలనుకుంటే, కేవలం స్వల్పకాలిక రకాలను మాత్రమే ఎంచుకోవాలని స్పష్టం చేశారు.ఈ అవగాహన కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త వినోద్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి శశిధర్,గ్రామ సర్పంచ్ సమత తిరుపతి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ బాశెట్టి హరీష్‌కు ఉత్తమ పాత్రికేయ పురస్కారం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** జాతీయ తెలుగు సారస్వత పరిషత్, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాళహస్తిలో నిర్వహించిన వార్షిక ఉత్తమ పాత్రికేయ పురస్కార ప్రదానోత్సవంలో ప్రముఖ జర్నలిస్ట్ బాశెట్టి హరీష్‌కు 'ఉత్తమ పాత్రికేయ పురస్కారం' అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ అహ్మద్ షరీఫ్,శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమ వెన్నం పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు.ఈ సందర్భంగా జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల సేవలు కీలకమని పేర్కొన్నారు. సమాజ చైతన్యానికి తోడ్పడుతున్న జర్నలిస్టులను గౌరవించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో జ్యోతి దినపత్రిక సంపాదకులు నాంపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రముఖులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/శంకరపట్నం:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కాచాపూర్ సర్పంచ్ ఊకంటి మాధవి అన్నారు. శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.పర్యావరణ పరిరక్షణపై గ్రామసభలో పలు సమస్యలను తీసుకువచ్చారు. రైతులు మత్స్యకారులకు జీవనాధారమైన కాచాపూర్ ఊర చెరువు శిఖం భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని గ్రామస్థులు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కాచాపూర్ పెద్ద గుట్ట ప్రాంతంలో గల ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా క్రషర్ నిర్మాణం చేపడుతున్నారని వెంటనే పనులు జరగకుండా నిలిపివేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.పర్యావరణానికి ముప్పు కలిగించే వాటిపై, ఊర చెరువు శిఖం భూమి అక్రణలకు గురి చేసిన వారిపై అధికారులు స్పదించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ మాధవితో పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గ్రామంలో ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లింగంపల్లి కృష్ణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంపత్, జీపీవో రాజు, వార్డు సభ్యులు మాతంగి లలిత, అడ్డురి సంపత్ రావు, ఊకంటి రవి, స్వరూప, తిరుమల, బుర్ర శారద, ఫిల్డ్ అసిస్టెంట్ స్వర్ణలత, అంగన్వాడి టిచర్ శారద ఐలయ్య గ్రామస్తులు తదితరులు పాల్గోన్నారు.

## వాలంటరీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/మానకొండూర్ :** మండలంలోని చెంజర్ల, కెల్లెడు, లింగాపూర్ గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న విద్యా వాలంటీర్ పోస్టులను భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి రాపెల్లి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా వాలంటీర్‌గా పని చేయటకు మహిళలు మాత్రమే అర్హులని ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత కలిగి ఉండాలని బ్రిడ్జి ప్రాథమిక శిక్షణ లేదా ప్రాథమిక విద్యా కోర్సు శిక్షణ చేసినవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. గౌరవ వేతనం నెలకు రూ.8 వేలు, ఆయాగా పని చేసే మహిళ కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని వారికి నెలకు రూ.6 వేలు గౌరవ వేతనం ఇస్తామని పేర్కొన్నారు. నోటిఫికేషన్ తేదీ నాటికి 18 నుంచి 44 సంవత్సరాల లోపు ఉన్న స్థానికులకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వబడుతుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యాఎస్ వారికి 5 సంవత్సరాల సడలింపు, మాజీ సైనికి ఉద్యోగులకు, దివ్యాంగులకు 10 సంవత్సరాల సడలింపు ఉంటుందని పేర్కోన్నారు. ఈనెల 4న నోటిఫికేషన్ విడుదల అయిందని 5 నుంచి 8 వరకు ధరఖాస్తుల స్వీకరణ 9న అర్హుల జాబితా జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ప్రదర్శించబడునని తెలిపారు. ధరఖాస్తు చేసేవారు సంబంధిత పత్రాలను జత చేసి సంబంధిత మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈనెల 8న సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని పేర్కోన్నారు.

## మోడీ సుపరిపాలన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**ప్రజాపక్షం/చొప్పదండిః** ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలన విజయాలను ప్రజ్జలోకి తీసుకెళ్లాలని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ బిజేపి శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. చొప్పదండి పట్టణంలోని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ద్వారా ఇటీవల కాలంలో ఆర్నకొండ, మల్యాల డబుల్ రోడ్డు, జగిత్యాల కరీంనగర్ 4 లైన్ల జాతీయ రహదారి అనేక గ్రామాలకు ప్రధాన మంత్రి సడక్ యోజన రోడ్లు అనేక గ్రామాలలో సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు, స్మశాన వాటికలు, గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు వంటి అత్యధిక కార్యక్రమాలు ప్రధాని మోడీ పరిపాలన ద్వారానే గ్రామ సీమల్లో జరిగాయని అన్నారు. మోడీ పాలన 12 ఏండ్లు పూర్తయిన సందర్భంగా కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా ప్రజల్లోకి ప్రధాని మోడీ, ఎంపి బండి సంజయ్ కుమార్ విజయాలను తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను విజయవంతం చేసి స్థానిక సమస్యలపై పోరాడాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మొగిలి మహేశ్, ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీ నారాయణ, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రావణ్ కుమార్, కౌన్సిలర్ జిట్ట కుమార్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గొల్ల గట్టయ్య, గుండేటి శివశంకర్ మండల ప్రధాన కార్యదర్శులు కొమ్ము రమేశ్, ఎడ్ల సురేశ చల్ల అనుష్ తదితరులు పాల్గొన్నారు.

## 8న జాబ్‌మేళా

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** మదర్ థెరిస్సా ఆశయంతో రూపుదిద్దుకున్న మాతృ ఆశయం ఎన్.జి.ఓ ఆధ్వర్యంలో ఈనెల 8న నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు కరీంనగర్ జిల్లాలోని మహిళలు హాజరు కావాలని ఆ సంస్థ అధ్యక్షులు బట్టారి ఆంజనేయ స్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ జిల్లా పరిధిలోని అన్ని మండలాలలో కుట్టు శిక్షణ, అల్లికలు పొందియున్న మహిళలు సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరీంనగర్ రాంనగర్ బస్‌స్టాఫ్ సమీపంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికైన మహిళలు తమ తమ గ్రామాల్లోని నిరుపేద మహిళలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని అందుకుగాను వారికి గౌరవ వేతనం కూడా ఇస్తామని వివరాలకు 9390305257 నంబర్‌లో సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని సర్పంచ నునుగోండ మానస ప్రవీణ్ అన్నారు. కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. మొక్కలను నాటి స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టి పర్యావరణ అవగాహన చేపట్టాలని గ్రామస్థులను కోరారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆరె నరేశ్, వార్డు సభ్యులు తోడేటి మధు, అరిగెల మల్లేశం, బొబ్బటి శ్రీకాంత్, రుద్ర రాజు, పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఆర్‌కు రాష్ట్రస్థాయి పర్యావరణ పురస్కారం

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** తెలంగాణ కాలుష్యం మండల ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పర్యావరణ హిత ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రస్థాయి అత్యుత్తమ కళాశాలగా ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల స్వయం ప్రతిపత్తి ఎంపికైంది. ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని రాష్ట్ర పర్యావరణం, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ అందుకున్నారు. అటవీ శాఖ మంత్రి కళాశాల పర్యావరణహిత కార్యక్రమాలను అడిగి తెలుసుకొని ప్రశంసించారు. మరిన్ని పర్యావరణహిత కార్యక్రమాలను విస్తృతస్థాయిలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాస్త్ర సహాయ ఆచార్య డా.పడాల తిరుపతి, అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహమ్మద్ నదీం, పాల్గొన్నారు.

## అగ్నివీర్‌లో మెరిసిన తేజస్



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** మే 31న ప్రకటించిన ఫలితాల్లో తేజస్ డిఫెన్స్ కళాశాల నుంచి 160 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు చైర్మన్ సిహెచ్ సతీష్ రావు తెలిపారు. కొత్తపల్లి తేజస్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 156 మంది విద్యార్థులు ఇండియన్ ఆర్మీలో, ముగ్గురు విద్యార్థులు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీరులుగా ఎంపికయ్యారని అన్నారు. ఇందులో ఇండియన్ ఆర్మీ జీడీ131, ట్రెడ్‌మెన్12, టెక్నికల్13, క్లర్క్1 ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో నాన్ టెక్నికల్ లో 3 ఉద్యోగాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఇండియన్ ఆర్మీ జూన్ 2025 హన్మకొండ ఆర్మీ ఓపెన్ ర్యాలీలో పాల్గొని మెరిట్ సాధించారని తెలిపారు. ఈనెల 8 నుంచి వారిట్రైనింగ్ సెంటర్లలో రిపోర్ట్ చేయాల్సి ఉందన్నారు. భారత రక్షణ దళంలో చేరి ఉన్నతమైన స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అకాడమీ ఏర్పాటు చేసిన నుంచి తెలంగాణలోనే అత్యధిక ఉద్యోగాలు సాధిస్తూ 2000 కు పైగా విద్యార్థులను ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దిన ఏకైక సంస్థ తేజస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పంట భూముల్లో సర్వేను నిలిపివేయాలి

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని దర్యాపూర్,కేశనపల్లి గ్రామ రైతులు తమ సాగు భూములను ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించవద్దని మంథని ఆర్డీవోకు విజ్ఞప్తి చేశారు.దర్యాపూర్ శివారులోని సర్వే నెంబర్లు 144,145 లో గల 100 ఎకరాల ప్రభుత్వ భూమిని దాదాపు 30 ఏళ్లుగా పేద రైతులు నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటున్నారు.గత ప్రభుత్వాలు వీరికి పట్టాలు కూడా పంపిణీ చేశాయి.అయితే, ముత్తారం తహసీల్దార్ ఆధ్వర్యంలో అధికారులు ఇండస్ట్రియల్ పార్క్ కోసం ఇక్కడ సర్వే చేపట్టడంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పరిశ్రమల పేరుతో భూములు లాక్కుంటే తాము రోడ్డున పడతామని, తక్షణమే ఈ సర్వేను నిలిపివేసి తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిషన్ రెడ్డి, రాజిరెడ్డి,జక్కుల ముత్తయ్య,నునె కుమార్ తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## కరపత్రం ఆవిష్కరణ

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా 3వ మహాసభల కరపత్రాన్ని సీఐటీయూ జిల్లా నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, కొడం రమణ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ నెల 14న జిల్లా కేంద్రంలో జరిగే మహాసభకు రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధి హామి కూలీలకు 200 రోజులు పని కల్పించాలని, రోజుకూలీ రూ.600కు పెంచాలని, కార్మికలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రాజం, సీఐటీయూ జిల్లా నాయకులు అన్నల్ దాస్ గణేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్, సహాయక కార్యదర్శి రాజేల్లయ్య, నాయకులు అంజయ్య, రాజు, శంకర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్లను నాటి జీవాన్నిచ్చే ప్రకృతినీ కాపాడుకోవాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో బిజెపి మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలను నాటారు. మానవాళికి జీవాన్ని ఇచ్చే చెట్లను నాటి ప్రకృతిని కాపాడుకోవాలని భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యాన్ని ఇచ్చే బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు.అంతకుముందు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ ప్రత్యేక సమగ్ర సవరణపై సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రాముఖ్యతపై ఓటర్ల జాబితాలో లోపాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదయాల ప్రతి బిజెపి కార్యకర్త వ్యవహరించాలని క్షేత్రస్థాయిలో పార్టీ ప్రతిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వడ్డేపల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, జివ్ర లక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు లవంగ శివ పట్టణ అధ్యక్షుడు ముష్కరి రాజ్ కుమార్, బిజెపి వివిధ శాఖల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## మొక్కలు నాటిన అధికారులు

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సారంగాపూర్ మండల కేంద్రంలో గ్రామపంచాయితీ పరిధిలో డిఆర్‌డివో పిడి రఘువరన్ ఆధ్వర్యంలో అమృత్ సరోవర్ ప్రాంతంలో మొక్కలు నాటి, ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కూలీ డబ్బులు ఎంత వస్తున్నాయి, ఎంత సేపు పని చేస్తున్నారు..? ఎండ వేడి తగలకుండా ఉదయం పూట సేపు పనులు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో మహమ్మద్ సలీం, స్థానిక సర్పంచ్ అరుణ శేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఉపాధి హామీ సిబ్బంది మనోజ్, శ్రీలత, శివ, కోటి ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ప్రజాసేవకు అంకితమైన నాయకుడు మేడిపల్లి

**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం ప్రజా సేవకు అంకితమైన నాయకుడు అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి కొనియాడారు. శుక్రవారం మేడిపల్లి సత్యం జన్మదినం సందర్భంగా నగరంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో కోర్ట్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తోపాటు కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడిపల్లి సత్యం ఉస్మానియా విశ్వ విద్యాలయం ఉద్యమ నాయకునిగా కీలక పాత్ర పోశించారని, విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ రాజకీయ రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. చొప్పదండి ప్రజల ఆశీస్సులతో




ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా పార్టీ బలోపేతానికి విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను పార్టీ శ్రేణులు, అభిమానులు శాలువాలతో సత్కరించి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ శాసన సభ్యులు ఆరెపల్లి మోహన్, మల్లిఖార్జున రాజేందర్, ఎండి. తాజ్, కర్ర రాజశేఖర్,బానోత్ శ్రావన్ నాయక్, వెన్న రాజమల్లయ్య, మడుపు మోహన్, సరిల్ల ప్రసాద్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## తల్లి పేరుపై మొక్క నాటిన గంగాడి కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/జమ్మికుంట :** ప్రధాని మోడి సుపరిపాలన 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తన తల్లి పేరుపై ఒక మొక్క ను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీ పిలుపుమేరకు అమ్మ పేరు మీద ఒక మొక్క ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. పర్యావరణాన్ని రక్షించుకుంటేనే భావి తరాలకు భవిష్యత్ ఉంటుందని అన్నారు. ప్రతిఒక్కరూ తమ తల్లి పేరుపై ఒక మొక్క నాటి పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. ప్రధానంగా గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులను అరికట్టడానికే దేశవ్యాప్తంగా కోట్ల సంఖ్యలో మొక్కలను నాటి వాటిని సంరక్షించడం లక్ష్యంగా ప్రతి ఏటా పెద్దఎత్తున కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. బిజేపి శ్రేణులు ప్రతి బూత్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారని హుజురాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా బిజెపి శ్రేణలు తమవంతు కీలకపాత్ర పోశించాలని సూచించారు. బిజేపి దేశవ్యాప్తంగా భారీ ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని జూన్ 5 నుంచి 17 వరకు వివిధ కార్యక్రమాలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు, ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు బైరెడ్డి వెంకటరమణ రెడ్డి, ఓబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రాజేందర్, కౌన్సిలర్లు శీలం శ్రీనివాస్, తూర్పాటి చందన శంకర్, గణపతి, ఇంగ్లె ప్రభాకర్, ఉప్పుల రమేశ్, కైలాసకోటి గణేశ్, రాచపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎస్కార్ట్ వాహనాన్ని ప్రారంభించిన గని అధికారులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి ఆర్జీ1 ఏరియా పరిధిలోని జీడీకే 2&2ఏ ఇంక్లైన్‌లో యాజమాన్యం నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్కార్ట్ వాహనాన్ని శుక్రవారం గని అధికారులు పూజలు నిర్వహించి ప్రారంభించారు.ఈ సందర్భంగా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆర్జీ1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను హాజరై మాట్లాడుతూ, జీడీకే 2&2ఏ ఇంక్లైన్‌లో పెద్ద పెద్ద మెటీరియల్ లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏఐటీయూసీ యూనియన్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నూతన ఎస్కార్ట్ వాహనం ఏర్పాటు చేయాలన్న యూనియన్ వినతికి యాజమాన్యం సానుకూలంగా స్పందించి వాహనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. కార్మికుల పక్షాన నూతన వాహనాన్ని ప్రారంభించినందుకు ఏఐటీయూసీ తరఫున యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేస్తూ శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు రమేశ్ బాబు, ఎస్.కే.అల్లాఉద్దీన్, డి.వెంకటేశ్వర్లు, కుమార స్వామి, మల్లేశం, హరీష్, తిరుపతి, దామోదర్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శులు పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న,నాయకులు పులి రవి, కొత్త రాజయ్య, మైన్స్ సేఫ్టీ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



## 8న పెద్దపల్లికి మాజీ మంత్రి హరీష్ రావు

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా,భవిష్యత్ కార్యాచరణ మరియు ప్రజా సమస్యలపై పోరాట వ్యూహాలను ఖరారు చేసేందుకు ఈ నెల 08న నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు.పెద్దపల్లి పట్టణంలోని రంగంపల్లి మెయిన్ రోడ్డులో గల తిరుమల గార్డెన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్,మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు,నియోజకవర్గంలోని ప్రస్తుత మరియు మాజీ ప్రజా ప్రతినిధులు,అన్ని మండలాల మరియు పట్టణాల కార్యవర్గ సభ్యులు,ముఖ్య నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు,పార్టీ అభిమానులు,ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి, భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

**ప్రజాపక్షం/రామగిరి:** పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యతని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ బండి సత్య నారాయణ అన్నారు.జూన్5, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామగుండం3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని జి.యం. కార్యాలయం నందు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ముందుగా పర్యావరణ విభాగాధిపతి పి.రాజారెడ్డి ఉద్యోగులందరితో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఉద్యోగులందరిలో అవగాహన కల్పించడం కోసం సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, ఐఏఎస్ సందేశంతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించి ఉద్యోగులందరికీ అందచేయడమే కాకుండా చదివి వినిపించారు.తదుపరి సింగరేణి కోల్ నీర్ ప్లాంట్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సంవత్సరం “ప్రకృతి నుండి ప్రేరణతో... వాతావరణం కోసం...మన భవిష్యత్తు కోసం” అనే నినాదంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గుర్తింపు, సంతోష్,కోట రవీందర్ రెడ్డి,ఉద్యోగులు పాల్గొన్నారు.

## బాల్యమిత్రుని కుటుంబానికి బాసట గానిలిచినా స్నేహితులు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** బాల్యమిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి బాసటగా నిలిచారు తనతో విద్యను అభ్యసించిన చిన్ననాటి స్నేహితులు.సుల్తానాబాద్ లో ని గాంధీనగర్ నివాసి అయిన మధ్యతరగతి కుటుంబానికి చెంధిన బల్ల అనిల్ గత కొన్ని రోజుల క్రితం మరణించా గా తనతో సుల్తానాబాద్ జిల్లా పరిషత్ హై స్కూల్ బాయ్స్ పాఠశాలలో 2007 సంవత్సరంలో చదువుకున్నా స్నేహితులు 12000 రూపాయలను వారి కుటుంబానికి అందజేసి బాసిటంగా నిలిచారు. తన స్నేహితుడి కుటుంబ పరిస్థితుల ను ఎమ్మెల్యే దృష్టి కి తిసుకెల్లి వారికి ఇందిరమ్మ ఇల్లు వచ్చేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. భవిష్యత్తు లో కూడా ఎలాంటి అవసరాలు ఉన్నా తమవంతు సహాయం ఎప్పుడు ఉంటుంది అన్నారు.ఆర్థిక సాయం అందించిన వారిలో జడ్పీహెచ్ఎస్ బాలురు 2007 (10వ) బ్యాచ్ స్నేహితులు వున్నారు.

## ఎన్ఎంఎస్‌లో ప్రతిభ చూపిన గర్రెపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లిలో గల తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్ లో అద్భుత ప్రతిభ కనబరచారు. మోడల్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు 1.ఎనగందుల శ్రీవిద్య 2. పోతుగంటి సాయి వర్షిత 3. కుర్మా వెంకట్ ఋషి 4.ఎమ్‌డి ఇర్ఫాన్ లు అద్భుత ప్రతిభ కనబరిచారు వీరిని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డా.గోల్డీ బల్బీర్ కౌర్ అభినందించారు.వీరికి సంవత్సరానికి 12 వేల రుపాయల చొప్పున 4 సంవత్సరాల వరకు 48,000/ రూపాయలు స్కాలర్ షిప్ రూపంలో లభిస్తాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# వాహనాలకు నంబర్ ప్లేట్ తొలగిస్తే కఠిన చర్యలు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : వాహనాలకు నంబర్ ప్లేట్ తొలగించి లేదా నంబర్లు స్పష్టంగా కనిపించ కుండా మార్ఫింగ్ చేసి వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని,ఇటువంటి చర్యలపై కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని సిరిసిల్ల పట్టణ సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్ తొలగింపు, నంబర్ ప్లేట్ మార్ఫింగ్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా 20 వాహనాలు గుర్తించి జరిమానా విధించి,ఆయా వాహన యజమానులకు కౌన్సిలింగ్ ఇచ్చి నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించామని అన్నారు. ప్రతి వాహనదారుడు తన వాహనానికి నంబర్ ప్లేట్‌ను స్పష్టంగా కనిపించే విధంగా తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.సరైన నంబర్ ప్లేట్లు ఉండటం వల్ల దొంగిలించబడిన వాహనాలను గుర్తించడం, నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుందని అన్నారు. సి.ఐ వెంట ట్రాఫిక్ ఆర్.ఎస్.ఐ శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

## ప్రి- ప్రైమరీ టీచర్ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాపక్షం/బీరుపూర్ : జగిత్యాల జిల్లా బీరుపూర్ మండలంలోని ప్రభుత్వం పాఠశాలల్లో ప్రిప్రైమరీ తరగతుల బోధన కోసం టీచర్ ఆయా పోస్టుల నియామకానికి మహిళా మరియు పురుషుల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యిధికారి సిరిప నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీరుపూర్ మండలంలోని తుంగూర్ కోల్వాయి మంగేళ కండ్లపెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి ప్రిప్రైమరీ తరగతులను ప్రారంభించనున్న నేపద్యం లో టీచర్ ఆయా పోస్టుల భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రిప్రైమరీ టీచర్ పోస్టులకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత తో పాటు ప్రతి ప్రైమరీ ట్రైనింగ్ సర్టిఫికెట్ కలిగిన మహిళ మరియు పురుష ఆయా పోస్టులకు అర్హులు స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. టీచర్ ఉద్యోగులకు నెలకు రూ. 8000 వేలు, ఆయా పోస్టులకు నెలకు రూ. 6000 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నట్లు మండల విద్యాధికారి సిరిప నాగభూషణం తెలిపారు. ప్రభుత్వ ప్రి ప్రైమరీ పాఠశాలల్లో టీచర్ ఆయా ఉద్యోగుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఆసక్తిగల అభ్యర్థులు అటెస్టెడ్ విద్యార్హత పత్రాలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో జూన్ 3 నుండి 6 వరకు సాయంత్రం ఐదు గంటల లోపు మండలంలోని మండల విద్యా వనరుల కేంద్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండలం విద్యాధికారి సిరిప నాగభూషణం తెలిపారు.

## వైద్యుల బదిలీల జీవో 38 అమలు ప్రక్రియలో పారదర్శకత లోపిస్తుంది

ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : వైద్యుల బదిలీల ప్రక్రియలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 38 లో పేర్కొన్న నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన టీజీజీడీఏ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక రోజు నిరసన తెలుపుతూ వైద్యసేవలు అందించామని, ప్రస్తుతం కొనసాగుతున్న బదిలీల ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకే ప్రాంతంలో లేదా సమీప ప్రాంతాల్లో విధులు నిర్వహించేలా కల్పించే స్పౌస్ ప్రాధాన్యతతో పాటు ఇతర ప్రత్యేక ప్రాధాన్యత ప్రమాణాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు.ఈ సమావేశంలో టీజీజీడీఏ జిల్లా కోశాధికారి డాక్టర్ జి. నవీన్‌తో పాటు టీవీవీపీ, మెడికల్ కాలేజీ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని వైద్యులు వినోద్ కుమార్ రెడ్డి, దీపక్ రెడ్డి,సాయి సుధ, తదితరులు, డాక్టర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ప్రజాపక్షం/ధర్మపురి : ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసి పర్యావరణాన్ని పరిరక్షించాలని మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి పిలుపునిచ్చారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా శుక్రవారం జగిత్యాలకు చెందిన సామాజిక సేవకులు, న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ సుమారు 2500 జ్యూట్ బ్యాగ్ లను ధర్మపురి పట్టణంలో పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి, కౌన్సిలర్ల చేతుల మీదుగా స్థానిక కూరగాయల మార్కెట్ లో వినియోగదారులకు, కూరగాయల విక్రయిదారులకు అనంతరం దేవాలయం ముందు భక్తులకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసంన్యాయవాది మధుసూదన్ రెడ్డి చేస్తున్న సేవా కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు.ప్లాస్టిక్ వాడకాన్ని రూపుమాపాలని కోరుతూ స్వయంగా జూట్ బ్యాగులు పెద్దమొత్తంలో పంపిణీ చేయడం ఆదర్శనీయమన్నారు. అంతకు ముందు చింతామణి చెరువు సమీపాన మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందారపు రామన్న దేవస్థానం పాలక మండలి మాజీ చైర్మన్ జక్కు రవీందర్, మున్సిపల్ కౌన్సిలర్లు సంగి ఆనంద్,పవన్ ,మున్సిపల్ అధికారులు గంగాధర్,మహేష్, వైశ్య సత్రం కోశాధికారి జక్కు దేవేందర్,తదితరులు పాల్గొన్నారు.

## నేరాలను త్వరితగతిన ఛేదించాలి



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి నేరాల నివారణకు ప్రాధాన్యత ఇస్తూనే, జరిగిన నేరాలను త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం అందించే విధంగా పోలీస్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ మీటింగ్‌లో ఆయన పోలీస్ అధికారులతో సమావేశమై వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.గత నెలలో నమోదైన నేరాలపై సమగ్రంగా చర్చించిన ఎస్పీ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి వాటి సంఖ్యను తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వారికి న్యాయమైన,సత్వర సేవలు అందించాల్సిన బాధ్యత పోలీస్ శాఖపై ఉందని పేర్కొన్నారు. అలాగే జిల్లాల మరియు రాష్ట్ర సరిహద్దుల నుంచి వచ్చే గంజాయి సరఫరా మార్గాలను గుర్తించి కీలక వ్యక్తులపై కేసులు నమోదు చేసి అక్రమ రవాణాను కట్టడి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్,ఎస్‌బీ డీఎస్పీ వెంకటరమణ, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు మరియు ఎస్.ఐలు పాల్గొన్నారు.

## సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర వెలకట్టలేనిది



ప్రజాపక్షం/వేములవాడటౌన్: సమాజాభివృద్ధిలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రజలకు–ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలు అభినందనీయమని రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బుస్స దశరథం అన్నారు. శుక్రవారం వేములవాడ లోని ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే హెచ్–143 వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులకు ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు బుస్స దశరథం ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బుస్స దశరథం మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేసే పాత్రికేయుల సేవలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. నూతన కార్యవర్గం ఐక్యతతో ముందుకు సాగి జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి అభివృద్ధి కోసం విశేష కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరసయ్య లు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం పాత్రికేయుల ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ ఆదర్శవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారు కొత్వాల్ శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు రసూల్, ఉపాధ్యక్షులు చింతలతాడెం దేవరాజ్, విష్ణు, జిల్లా సభ్యులు కంటాల విజయ్, క్యాషియర్ పంపరి నాగరాజు, దెబ్బేటి ప్రవీణ్, సందీప్, ఆర్యవైశ్య మహాసభ సభ్యులు చికోటి అశోక్, బుస్స బుచ్చిబాబు, దైత కుమార్, ఆర్య వైశ్య నాయకులు చేపూరి రవీందర్, చేపూరి గణేష్, వాసవి క్లబ్ గవర్నర్ నరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య



ప్రజాపక్షం/గొల్లపల్లి : మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది .వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని వెనుగుమట్ల గ్రామానికి చెందిన ఐతేనేని పోచయ్య (70) గత నాలుగు సంవత్సరాలుగా మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు.ఇదే క్రమంలో జీవితం పై విరక్తి చెంది జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం సుమారు 5 గంటల సమయంలో తన ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డు వాసంకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ మేరకు మృతుని భార్య ఐతేనేని లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

## భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న చొప్పదండి ఎమ్మెల్యే

ప్రజా పక్షం/ వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం శుక్రవారం జన్మదిన సందర్భంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మేడిపల్లి సత్యం కు ఆలయ అర్చకులు, వేద పండితులు స్వస్తితో స్వాగత ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వేదాశీర్వచనం అందజేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకులు గౌరీ భట్ల శ్రీనివాస్ శర్మ స్వామివారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. జన్మదిన వేడుకల సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందిన మేడిపల్లి సత్యం రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు.

## ఇండియన్ ఆర్మీకి ఎంపికైన యువకుడికి సన్మానం

ప్రజాపక్షం/గొల్లపల్లి : దేశ సేవ చేయాలని సంకల్పంతో కష్టపడి చదివిన ఆ యువకుడు తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకుని యువతకు ఆదర్శంగా నిలిచాడు.జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లక్ష్మీ పూర్ గ్రామానికి చెందిన తూడి బాపయ్యసత్తవ్వ దంపతుల కుమారుడు తూడి సాయి గణేష్ ఇటీవల ఇండియన్ ఆర్మీ ఉద్యోగానికి ఎంపిక కావడం తో ముదిరాజ్ లయన్స్ యూత్ సభ్యులు శుక్రవారం శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ మా తోటి మిత్రుడు ఆర్మీకి ఎంపిక అయి గ్రామానికి వన్నె తెచ్చాడు.గ్రామ యువకులు సాయి గణేష్ ను ఆదర్శంగా తీసుకొని చెడు వ్యసనాలకు దూరంగా అంటూ లక్ష సాధన కోసం మన దేశానికి సేవలు అందించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు .తమ కుమారుడు ఆర్మీలో ఎంపిక అయినందుకు తల్లిదండ్రులు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు.మాట్ని తిరుపతి,దాసరి మల్లేష్,తుడి శ్రీకాంత్,మాట్ని కళ్యాణ్, శ్రీనివాస్, రోహిత్,విక్కీ నాగరాజు పిట్టల రాజు,పిట్టల రాజేష్,రాకేష్,చందు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇటిక్యాలలో మొక్కలు నాటిన అటవీ అధికారులు

ప్రజాపక్షం/రాయికల్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని గంగాదేవి పార్క్‌లో శుక్రవారం రోజున రాయికల్ అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కల నాటడం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు,గ్రామస్తులు కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో భూమేశ్వర్ మాట్లాడుతూ చెట్ల పెంపకం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్,ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి,కార్యదర్శి రాజేష్,కనపర్తి శ్రీనివాస్, ప్రకృతి ప్రేమికుడు సుంకిశాల సత్తయ్య గౌడ్,అటవీశాఖ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.

## గని ప్రమాదంలో కార్మికుడికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే న్యూటెక్ గనిలో శుక్రవారం ఉదయం జరిగిన ప్రమాదంలో బి వంశీకృష్ణ అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. గనిలో హాలర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న వంశీకృష్ణ డ్యూటీలో ఉండగా, రూఫ్ డ్రమ్ము నుంచి వచ్చిన మోటర్ కేసింగ్‌కు తగలడంతో మోటర్ డ్రమ్ము పగిలిపోయింది. ఈ ఘటనలో అతని ముఖం, తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే అత్యవసర చికిత్స కోసం రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. జరిగిన ప్రమాదానికి స్పందించిన పలు కార్మిక సంఘ నాయకులు అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి ప్రమాదకర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆయా, ఇన్స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం / కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మండలంలోని 22 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 202627 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమయ్యే ప్రీ ప్రైమరీ తరగతుల కోసం ఆయా, ఇన్స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు సంబంధిత పాఠశాలల్లో నిర్ణీత దరఖాస్తు ఫారంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్ ఉత్తీర్ణత, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించినట్లు తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ముందుగా సంబంధిత ఆవాసం, గ్రామానికి చెందిన వారికి ప్రాధాన్యత ఇచ్చి, అనంతరం మండలంలోని ఇతర గ్రామాల అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. స్థానికంగా నివసించే అర్హులైన అభ్యర్థులు మెమో, నివాస ధ్రువపత్రం తదితర జిరాక్స్ ప్రతులను గెజిటెడ్ అటెస్ట్ చేయించి ఈ నెల 9వ తేదీ లోగా సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తుది ఎంపిక జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు.నామా నగర్, జీడిచెను, భట్పల్లి, బలగాల, జవ్వాజిగూడ, నజ్రుల్ నగర్, విలేజ్ నంబర్ 3, 5, 10, 13, కోసిని, సర్ సిల్క్, డాడా నగర్, కొత్త అనుకోడ, బోడేపల్లి పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు మంజూరైనట్లు వివరించారు.

## అయిదుగురు నేషనల్ స్కాలర్‌షిప్‌లకు ఎంపిక

**ప్రజాపక్షం / నందిపేట్ :** ప్రభుత్వం ప్రకటించిన నేషనల్ మీన్స్, మెరిట్ స్కాలర్‌షిప్‌లు నందిపేట్ నుంచి అయిదుగురు ఎంపిక అయినట్టు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. నలుగురు మోడల్ తెలంగాణ స్కూల్, ఆంధ్రనగర్ పాఠశాల నుంచి ఒకరు ఎంపిక అయినట్టు ఆయన చెప్పారు.

# పర్యావరణ హిత సంస్థగా సింగరేణిని తీర్చిదిద్దడమే లక్ష్యం

**ప్రజాపక్షం / మందమర్రి :** మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి, ప్రతి ఉద్యోగి బాధ్యత అని మందమర్రి ఏరియా ఇన్‌ఛార్జ్ జనరల్ మేనేజర్ జి.ఎల్. ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా జీఎం కార్యాలయం, కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ (కేకే ఓసీపీ)లో పర్యావరణ పరిరక్షణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో జీఎం కార్యాలయ ప్రాంగణంలో ఇన్‌ఛార్జ్ జనరల్ మేనేజర్ జి.ఎల్. ప్రసాద్ ఉద్యోగులు, అధికారులతో కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిని రక్షించేందుకు మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పర్యావరణహిత జీవన విధానాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సీఎండీ దూరదృష్టితో సింగరేణిని పర్యావరణహిత సంస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం కేకే ఓసీపీ ప్రాంగణంలో ఇన్‌



ఛార్జ్ జీఎం జి.ఎల్. ప్రసాద్, ఏరియా పర్యావరణ అధికారి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, ఉద్యోగులు పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేసి, గని పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమాల్లో ఏరియా పర్యావరణ అధికారి వెంకటరెడ్డి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, డిప్యూటీ ఎఫ్‌ఎమ్ (అకౌంట్స్) సరిత, ఏఐటియుసి నాయకులు రమణ, గీతిక, కేకే ఓసీపీ ప్రాజెక్ట్ ఇంజనీర్ వెంకటవంశీధర్, మేనేజర్ రామరాజు, పర్యావరణ అధికారి శ్రీధర్ గౌడ్, వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్, కార్మిక సంఘాల ప్రతినిధులు, సూపర్‌వైజర్లు, క్లరికల్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# అక్రమ వెంచర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

### బచ్చలి ప్రవీణ్ కుమార్

**ప్రజాపక్షం / మందమర్రి :** ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఏర్పాటు చేస్తున్న అక్రమ వెంచర్లపై అధికారులు సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుడు బచ్చలి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని వెంకటపూర్ గ్రామ పంచాయతీ లేమూరు శివారులో సాగుతున్న ఈ అక్రమాలపై ఆయన ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములను సంబంధిత అనుమతులు, నాలా కన్వర్షన్, లేఅవుట్ ఆమోదాలు లేకుండానే ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ చర్యల వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడటమే కాకుండా, అమాయక ప్రజలు మోసపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ



నిబంధనలను తుంగలో తొక్కుతూ పచ్చని పొలాలను ప్లాట్లుగా మార్చి అక్రమంగా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న వెంచర్లను వెంటనే నిలిపివేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రయోజనాలను కాపాడటంతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని రక్షించేందుకు సంబంధిత శాఖలు తక్షణమే స్పందించాలని కోరారు.

# ప్లాస్టిక్ రహిత సమాజంతోనే పర్యావరణ పరిరక్షణ

**ప్రజాపక్షం / జన్నారం :** అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇందన్‌పల్లి గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందన్‌పల్లి అటవీ రేంజ్ అధికారి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ చేపట్టినట్లు పేర్కొన్నారు. రేంజ్ కార్యాలయ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు వివరించారు. ప్లాస్టిక్ కారణంగా నేల, నీరు, గాలి కాలుష్యం పెరుగుతుందని, పూర్తిగా కరగడానికి వందల సంవత్సరాలు పడుతుందని తెలిపారు. పశువులు, అడవి జంతువులు, పక్షులు ప్లాస్టిక్ తిని ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కాలువలు, డ్రైనేజీలు మూసుకుపోయి వరదలకు కారణమవుతాయని, నదులు, చెరువులు, సముద్ర జీవవ్యవస్థకు తీవ్ర హాని కలుగుతుందని చెప్పారు. ప్లాస్టిక్‌ను కాల్చినప్పుడు విడుదలయ్యే విషపూరిత వాయువులు మానవ ఆరోగ్యానికి ప్రమాదకరమని,



సూక్ష్మ ప్లాస్టిక్ ఆహారం, తాగునీటి ద్వారా శరీరంలోకి చేరి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండండి, పర్యావరణాన్ని కాపాడండి అనే నినాదంతో ప్రజలకు సందేశం ఇచ్చారు. రానున్న వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతిని మాత్రమే పూజించాలని, పీఓపీ గణపతి విగ్రహాలు పర్యావరణ కాలుష్యానికి కారణమవుతాయని సూచించారు. మట్టి గణపతిని పూజించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణే భవిష్యత్ తరాలకు భరోసా

**ప్రజాపక్షం / రెబ్బెన :** ప్రకృతిని కాపాడుకుంటూ పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని రెబ్బెన అటవీ రేంజ్ అధికారి కె. రమాదేవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రెబ్బెన అటవీ రేంజ్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. ప్రస్తుతం పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో అడవుల సంరక్షణతో పాటు విస్తృతంగా మొక్కలు నాటడం అత్యవసరమని పేర్కొన్నారు. మొక్కలు మనిషి జీవనాధారమని, వాటిని నాటడమే కాకుండా సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు



స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చని తెలిపారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

### కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం / నిర్మల్‌టౌన్ :** బ్యాంకులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో, శుక్రవారం 20252026 ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికానికి సంబంధించిన డిసిసి డిఎల్‌ఆర్ సి సమావేశం నిర్వహించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తత, పొదుపు బ్యాంకింగ్‌పై అవగాహన కలిగేలా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వెనకబడిన తరగతుల ప్రజలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, రైతులకు, వీది వ్యాపారస్తులకు, విద్యార్థులకు అందించు రుణాల మంజూరులో ఆలస్యం చేయకూడదన్నారు. వివిద రకాల రుణాలకు అర్హులైన దరఖాస్తుదారులకు సంబందిత రుణాలను అందజేయాలన్నారు. అనంతరం 202627 వార్షిక రుణ ప్రణాళిక నివేదకను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాం గోపాల్, ఎస్బీ టీజిబి రీజినల్ మేనేజర్లు రంజాన్ కుమార్, నవీన్ కుమార్, ఆర్బి లింక్డ్ బ్యాంకింగ్ ఆఫీసర్ రాములు, ఇతర అధికారులు, బ్యాంకర్లు, పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న జొన్న, మొక్కజొన్న కొనుగోళ్లు

**ప్రజాపక్షం/ నేరడిగొండః** మండల వ్యాప్తంగా మొక్కజొన్న, జొన్న పండించిన రైతులు తమ పంటనున నేటి లోపల మార్కెట్‌లో అమ్ముకోవాలని పీఏసీఎస్ సీఈఓ గోలి స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై మొక్కజొన్న, జొన్న కొనుగోళ్లను శాశ్వతంగా నిలిపివేస్తామని, రైతులు విషయాన్ని దృష్టిలో ఉంచుకోని సహకరించాలని కోరారు.

## ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** కామారెడ్డి జిల్లాలోని ప్రీ ప్రైమరీ తరగతులు56 పాఠశాలలకు మంజూరు చేయబడ్డాయని, ఈ పాఠశాలల్లో ఒక ప్రీప్రైమరీ, ఒక ఆయా పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆయాకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత, ఎంపికలో అదే నివాస ప్రాంతం, అదే గ్రామపంచాయతీ వారికి అవకాశమని, 18 నుండి 44 సం.ల వయస్సు కలిగి ఉండి ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఈడబ్లుఎస్ అభ్యర్థులకు 5 సం.లు, మాజీ సైనికులకు 3 సం.లు, దివ్యాంగులకు 10 సం.లు. దరఖాస్తులు జూన్ 6వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు అవకాశం ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు జత చేసి మండల విద్యాశాఖ అధికారి దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## రైతులు పంట వ్యర్థాలను దహనం చేయవద్దు

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** రైతులు ఎవరూ వరి, మొక్కజొన్న, జొన్న తదితర పంటల వ్యర్థాలను పంట సాగు అనంతరం దహనం చేయరాదని ఏఈఓ రేణుక సూచించారు. పంట వ్యర్థాలు కాల్చడం వలన నేల సారం తగ్గిపోవడంతో పాటు పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని దుష్ప్రభావాలు ఎక్కువగా ఉంటాయన్నారు. రైతులు ఎవరూ పంట వ్యర్థాలు కాల్చరాదని సూచించారు. రైతులు పాల్గొన్నారు.

## భరతమాత సేవలో తరించడం అదృష్టం

**ప్రజాపక్షం/పిట్లంః** భరతమాతకు సేవ చేసే భాగ్యం ఒక వరం వంటిదని పిట్లం మండలం చిన్నకొడప్‌గల్ గ్రామ సర్పంచు కిరణ్‌కుమార్ అన్నారు. గ్రామానికి చెందిన 5 గురు యువకులు ఇటీవల అగ్నివీర్‌కు ఎంపిక కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేయడమే కాకుండా శుక్రవారం యువకులను శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. గ్రామంలోని యువత మంచి లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని తమ లక్ష్యం దిశగా ముందుకు సాగాలని, అప్పుడే తమ తల్లితండ్రులకు, గురువులకు మంచి పేరు లభిస్తుందన్నారు.

## ప్లాస్టిక్, కాలుష్యాన్ని తరిమికొట్టి పర్యావరణాన్ని కాపాడాలి

### హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్

**ప్రజాపక్షం / జన్నారం :** మానవ మనుగడకు ఆధారమైన ప్రకృతిని కాపాడుకోవడానికి ప్లాస్టిక్ భూతాన్ని, కాలుష్య రక్కసిని తరిమేయాల్సిన అవసరం ఉందని హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. అడవుల నరికివేతను అడ్డుకుని పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మన్మద్ గ్రామంలో ప్రజా పాలన గ్రామ సభ

**ప్రజాపక్షం / లోకేశ్వరం :** మన్మద్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మరియు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ బాయమొల్ల లలిత భోజన్న, ఆధ్వర్యంలో మొక్కలను నాటడం జరిగింది. అదే విధంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేయడం జరిగింది. అనంతరం గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గీతా భవాని సాయి ప్రసాద్ మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, వార్డు సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగేష్ గౌడ్ గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

## కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం / లోకేశ్వరం :** లోకేశ్వరం మండలానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై వివాహ ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు.ఎమ్మార్వో సూర్యారావు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో ఘనంగా 'ఇంపాక్ట్ ఇంటర్నేషనల్' సమావేశం

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని వాసవి వరల్డ్ స్కూల్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజియన్19 ప్రతినిధుల సమావేశం ఘనంగా జరిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రతినిధుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుండి ముఖ్య అతిథులు శ్యాం రాథోడ్, జి.రవికుమార్, జి.రామ విచ్చేసి, యువత అభివృద్ధి మరియు సంస్థ ఆశయాలపై దిశానిర్దేశం చేశారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గంప నాగేశ్వరరావు ఆశయ సాధకకోసం కట్టుబడి పనిచేస్తామని నూతన కార్యవర్గం స్పష్టం చేసింది. ఉమ్మడి జిల్లా ఇంపాక్ట్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న అధికారులకు ఘన వీడ్కోలు, సన్మానం

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** మండల పరిషత్ కార్యాలయంలో మరియు వివిధ గ్రామాలలో పనిచేసిన అధికారులు ఇతర మండలాలకు బదిలీ కావడంతో వీరికి శుక్రవారం రోజున మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు సన్మానం నిర్వహించారు. ఈ యొక్క సన్మాన కార్యక్రమానికి డిప్యూటీ సిఈఓ శంకర్ ముఖ్య అతిథిగా హాజరు కావడం జరిగింది. సీనియర్ అసిస్టెంట్ రమణ, ఆర్.డబ్ల్యు.ఎస్. ఏ.ఈ. రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి సునీల్, శ్రావణ్, స్వాతి, ప్రవళిక, ఆకాష్, నాగేష్, ఏఈఓ శ్రీ వాణి, అటెండర్ రమణలకు శాలువాలు కప్పి సన్మానించి వీడ్కోలు తెలిపారు. ఉద్యోగ వృత్తిలో బదిలీలు అనేది సాధారణంగా జరుగుతాయని ఇక్కడ వెళ్ళిన ప్రజల కొరకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని చేసే పనిలో వ్యత్యాసాలు లేకుండా అందరినీ కలుపుకొని ప్రజల అవసరాలకు తగ్గట్టు గ్రామాలలో పనిచేస్తే గుర్తింపు వస్తుందని అందరూ కలిసి ఒక టీంగా పనిచేస్తే జిల్లా స్థాయిలో మండలానికి గుర్తింపు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ అరుణ రాణి, ఎంపిఓ గోవర్ధన్, ఏఓ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్




**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏరియా జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ యూ హాల్‌లో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనరల్ మేనేజర్ మాట్లాడుతూ నీరు, భూమి, గాలి కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. 32 సంవత్సరాల క్రితం నాటి జీఎం బాలకృష్ణ ప్రారంభించిన మొక్కల పెంపకం కార్యక్రమం నేడు సింగరేణి వ్యాప్తంగా నిరంతర ప్రక్రియగా కొనసాగుతోందన్నారు. సింగరేణి పరిధిలో సుమారు 15 వేల హెక్టార్లలో ఐదున్నర కోట్లకు పైగా మొక్కలు నాటగా, శ్రీరాంపూర్ ఏరియాలోనే 22 లక్షలకు పైగా మొక్కలు నాటినట్లు తెలిపారు. మొక్కల పెంపకం ఫలితంగానే గతంతో పోలిస్తే సింగరేణి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించుకోవడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు ప్రకృతితో ప్రేరణ అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని చాటిచెప్పేలా వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలపై ఉద్యోగుల అభిప్రాయాలను స్వీకరించగా, లా విభాగానికి చెందిన మల్లేష్, ఫైనాన్స్ విభాగానికి చెందిన రాణి రుద్రమ పర్యావరణ ప్రాముఖ్యతను వివరించడంతో పాటు పాటల ద్వారా సందేశాన్ని అందించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, అధికారుల సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, హరినారాయణ, ఆనంద్ కుమార్, ఏరియా ఇంజనీర్ రమణరావు, ఏజీఎం సుమలత, ఏరియా సర్వేయర్ నర్సింగారావు, డీవైపీఎం కిరణ్, సీనియర్ పీఓలు సురేందర్, ప్రశాంత్, మురళి, ఎన్విరాన్‌మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, పిట్ సెక్రటరీ సందీప్ పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి సామాజిక కర్తవ్యం

మున్సిపల్ కమిషనర్ రాజలింగు



**ప్రజాపక్షం / మందమర్రి :** భూమిపై జీవజాతుల మనుగడకు ప్రకృతే మూలాధారమని, పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి సామాజిక కర్తవ్యమని మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మందమర్రి మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో ఆయన ఆధ్వర్యంలో 100 మొక్కలను నాటారు. కమిషనర్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, విచ్చలవిడిగా జరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం, అడవుల నరికివేత వంటి అంశాలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని చెట్టుగా పెంచాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని ప్రేమిస్తే ప్రకృతి మనకు ఆరోగ్యం, ఆహారం, స్వచ్ఛమైన గాలి రూపంలో అనేక రెట్లు తిరిగి ఇస్తుందని తెలిపారు. భావితరాలకు సురక్షితమైన, పచ్చని భవిష్యత్తును అందించాలంటే నేటి నుంచే పర్యావరణ పరిరక్షణకు అందరూ కట్టుబడి ఉండాలని కోరారు. మొక్కల పెంపకం, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, పచ్చదనం విస్తరణ ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడాలని సూచించారు. పచ్చని మందమర్రి నిర్మాణానికి మున్సిపాలిటీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, మేనేజర్ టి. రాజేశ్వరి, టీపీబీవోలు మనోజ్, సాయి నిఖిల్, రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం. గోపి కృష్ణ, సిస్టమ్ మేనేజర్ ఎ. శిరీష్, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి. శ్యాంబాబు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హరిత గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

మండల అభివృద్ధి.. అధికారి రాజేశ్వర్



**ప్రజాపక్షం / మందమర్రి :** గ్రామాల్లో పచ్చదనం పెరిగితేనే స్వచ్ఛమైన గాలి, సమృద్ధిగా వర్షాలు, ఆరోగ్యకరమైన జీవన విధానం సాధ్యమవుతుందని మందమర్రి మండల అభివృద్ధి అధికారి రాజేశ్వర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాల్లో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పే లక్ష్యంతో చేపట్టిన స్వచ్ఛ గ్రామం – సురక్షిత జలవాయు పథకంలో భాగంగా మందమర్రి మండలంలోని సారంగపల్లి, శంకర్పల్లి గ్రామ పంచాయతీలలో విస్తృత స్థాయిలో మొక్కల నాటడం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటి మాట్లాడారు. పెరుగుతున్న వాతావరణ మార్పులు, కాలుష్య సమస్యలను ఎదుర్కోవడంలో మొక్కలే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కేవలం మౌలిక సదుపాయాలకే పరిమితం కాకుండా పర్యావరణ పరిరక్షణతో కూడిన సమగ్ర అభివృద్ధి వైపు సాగాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను దత్తత తీసుకొని పెద్ద చెట్టుగా పెంచాలని కోరారు. గ్రామాలను హరితవనాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలను మరింత పరిశుభ్రంగా, పచ్చగా, పర్యావరణ హితంగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

ఎస్ఐ జి. నరేష్



**ప్రజాపక్షం / మందమర్రి :** మద్యపానానికి బానిసై కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు వేప చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని సండ్రోన్ పల్లి గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మందమర్రి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సండ్రోన్‌పల్లి గ్రామానికి చెందిన ఏదుల రాజ్‌కుమార్ (28) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిస కావడంతో కుటుంబంలో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన రాజ్‌కుమార్ గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఓ వేప చెట్టుకు ఉరివేసుకుని రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే మందమర్రి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. మృతుడి తల్లి ఏదుల లస్మక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 124/26, సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై జి. నరేష్ తెలిపారు.

# మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్



**ప్రజాపక్షం / మందమర్రి :** పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలని జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కేకేఓసీ ప్రాజెక్ట్ ఆవరణలో గురువారం అటవీ శాఖ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన తొలి మొక్కను నాటి మాట్లాడారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు నిజమైన అర్థం చేకూరుతుందని పేర్కొన్నారు. ఫారెస్ట్ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ రావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అటవీ విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యంతో చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు పచ్చని ప్రకృతిని అందించడంలో దోహదపడతాయని అన్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి రత్నాకర్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేకేఓసీ ప్రాజెక్ట్ పరిధిలో నిర్వహించిన సామూహిక మొక్కల నాటకం ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రకాల మొక్కలను నాటి వాటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ వెంకటరెడ్డి, ఫారెస్ట్ ఆఫీసర్ నవీన్, అటవీ శాఖ అధికారులు, కేకేఓసీ ప్రాజెక్ట్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారిపై పేరుకుపోయిన చెత్త కుప్ప

అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం

**ప్రజాపక్షం / శ్రీరాంపూర్ :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్‌లో రహదారిపై చెత్త పేరుకుపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధి మధ్యలోనే ప్లాస్టిక్ వ్యర్థాలు, గృహ చెత్త, ఎండిన ఆకులు పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. చెత్త కుప్పల వద్ద పశువులు తిరుగుతూ ఉండటంతో వ్యర్థాలు మరింతగా రోడ్డంతా వ్యాపిస్తున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, పలు రోజులుగా చెత్తను తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ దోమలు, ఈగలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## డొంకేశ్వర్‌లో కర్ర గణపతికి ఆలయం

ప్రజాపక్షం /నందిపేట్ : డొంకేశ్వర్ మండల కేంద్రంలో సర్వసమాజ్ ఆధ్వర్యంలో కర్ర గణపతి ఆలయం నిర్మించాలని అనుకుంది. వెంటనే భవన నిర్మాణానికి పూనుకుంది. గతంలో సత్య గంగు కళ్యాణ మండపంలో కర్ర గణపతిని ఏర్పాటు చేసేవారు. పూజలు పూర్తయిన తరువాత ఒక పెట్టెలో భద్రపరిచేవారు. అందుకే ప్రతిరోజు పూజలు చేసే విధంగా సర్వసమాజ్ భవన నిర్మాణం చేపట్టింది. వచ్చే గణపతి పూజ కొత్త ఆలయంలో జరుపుకోవాలని కమిటి నిర్ణయం తీసుకుంది.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

ప్రజాపక్షం/భీమ్‌గల్ : ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలం దించాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ వైద్యులకు సూచించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు.రికార్డులను, రిజిస్ట్రర్లను పరిశీలించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య కేంద్రంపరిసరాల్లో వైద్యులతో కలిసి మొక్కలు నాటారు.డీయంఅండ్‌హెచ్‌ఓ వెంట వైద్యులు అజయ్ పవర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, సబ్సిడీపై ఇవ్వాలి

ప్రజాపక్షం/భీమ్‌గల్ : ఖరీఫ్ సీజన్‌లో రైతాంగానికి అవసరమైన అన్ని రకాల విత్తనాలు ఎరువులు పురుగు మందులు ఉచితంగా ఇవ్వాలని, పాత రుణాలు రద్దు చేసి కొత్తగా వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, ఏఐయుకెఎస్ ఆర్మూర్ ఏరియా ఆధ్వర్యంలో వేల్పూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసినట్లు రాజన్న, కిషన్‌లు తెలిపారు. రైతాంగానికి, వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు సగం సబ్సిడీపై ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని, కనీస మద్దతు ధరలు నిర్ణయించి పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కల్తీ విత్తనాలు, పురుగు మందులను అరికట్టాలని, కల్తీ విత్తన వ్యాపారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, అకాల వర్షాలతో నష్టపోయిన అరటి, మామిడి ఇతర పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారమిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు ప్రయోజనాలను తాకట్టు పెట్టే విధానాలను వెంటనే నిలిపివేయాలన్నారు. ఏఐయుకెఎస్ ఆర్మూర్ ఏరియా ఉపాధ్యక్షులు రమేష్, నాయకులు బద్రి, సాయన్న, నాగన్న, మల్లేష్, గంగారాం, సాయన్న, పోశన్న పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్‌కలెక్టర్

ప్రజాపక్షం/బాల్కొండ : మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ వ్యవసాయాధికారులతో సమీక్షా సమావేశంని ర్వహించారు. రైతులకు పట్టా పాస్‌బుక్ ఆధార్ సీడింగ్ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ సిబ్బంది తదితరులున్నారు.

## నిర్మల్ ఆర్టీసి డిపో నుండి రామేశ్వరం ప్రత్యేక బస్సు ప్రారంభం

ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ : ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్మల్ డిపో నుండి రామేశ్వరం ప్రత్యేక యాత్రా బస్సును ప్రారంభించినట్లు డిపో మేనేజర్ కే.పండరీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మిక పర్యటనల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక సర్వీసుపై భక్తులు, ప్రయాణికుల నుండి విశేష స్పందన లభించిందని ఆయన పేర్కొన్నారు.



### ప్రధాన పుణ్యక్షేత్రాల మీదుగా ప్రయాణం

ఈ ప్రత్యేక బస్సు నిర్మల్ డిపో నుండి బయలుదేరి ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కాణిపాకం, వెల్లూరు, అరుణాచలం, శ్రీరంగం, పలని, పాతాలశెంబు, మధురై మీదుగా రామేశ్వరం చేరుకుంటుందని డిఎం తెలిపారు అక్కడ దర్శనానంతరం తిరిగి ప్రయాణమై బుధవారం నాటికి క్షేమంగా నిర్మల్ డిపోకు చేరుకుంటుందని ఆయన వివరించారు.

### భారీ స్పందన... జూలైలో మరో ట్రిప్

ఆర్టీసి ప్రవేశపెట్టిన ఈ ఆధ్యాత్మిక ప్యాకేజికి ప్రయాణికుల నుండి అద్భుతమైన ఆదరణ లభించిందని డిపో మేనేజర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ బస్సు సర్వీసును ఆన్‌లైన్ రిజర్వేషన్‌లో ఉంచిన కేవలం మూడు రోజుల్లోనే సీట్లన్నీ పూర్తిగా బుక్ అయిపోయాయని వెల్లడించారు. ప్రయాణికుల నుండి వస్తున్న డిమాండ్ లభిస్తున్న ప్రజాధరణను దృష్టిలో ఉంచుకొని, జులై మొదటి వారంలో ఇదే రూట్‌ను నడపనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

### ఆర్టీసి అభివృద్ధికి సహకరించాలి

ఆర్టీసీ అందిస్తున్న ప్రత్యేక యాత్రా బస్సు సేవలను ఇంతగా ఆదరిస్తున్న ప్రయాణికులకు, భక్తులకు డిపో మేనేజర్ పండరీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రయాణికులు తమ ఆదరాభిమానాలను ఎల్లప్పుడు ఆర్టీసి సంస్థపైనే ఉంచి, సంస్థ ప్రగతికి, అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం, సుఖవంతం, శుభప్రదం, అని పేర్కొంటూ ప్రయాణికులంతా ప్రభుత్వ రవాణా వ్యవస్థను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## అయ్యా పాలకులారా.. మా గిరిజన సమస్యలు పట్టవా?

### ఎమ్మెల్యే , ఎంపి, ప్రభుత్వ అధికారులపై తీవ్ర అసహనం

ప్రజాపక్షం / ఖానాపూర్ : మా గ్రామాలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించి, మా గ్రామాల నుండి బాహ్య ప్రపంచానికి దూరం చేస్తున్న దొత్తివాడు, కడెం వాగులపై వంతెనలు నిర్మించాలని గత కొన్ని రోజులుగా నివసించే ఇళ్ళను, ఉన్న ఊరిని వదిలి గుమ్మేనా, ఎంగ్లాపూర్, వస్పెల్లి, దొందారి, పసుపుల, యాపల్‌గూడ, చాకిరేవు గ్రామాల ప్రజలు పెంబి మండల కేంద్రంలోని అటవీ కార్యాలయం ఎదుట నిరసన దీక్షకు పూనుకున్నారు. ఎన్నో ఏళ్ళు గడుస్తున్నా, తమ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక మా గ్రామాలను బాహ్య ప్రపంచం నుండి వేరు చేసి వాగులపై వంతెనలు లేక అనేక అవస్థలు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటికి త్రీఫేజ్ కరెంట్‌లేక పంటలు పండించలేకపోతున్నామని, ఏ పంటలు పండించాలన్నా వర్షాధారమే అని అలా పండించిన పంట అమ్మడానికి సరైన రోడ్డు సౌకర్యం లేదని ఆవేదన చెందుతున్నారు.మండలంలోని మారుమూల గ్రామాలలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమయంలో పర్యటించి ఇక్కడి ఆదివాసీ, గిరిజనుల ప్రధాన సమస్య రోడ్డు త్రీఫేజ్ కరెంట్‌లపై స్పష్టంగా హామీ ఇచ్చారని కానీ ఇప్పటి దాకా హామీలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. అటవీ అనుమతుల పేరుతో కాలం వెళ్ళదీస్తున్నారని క్షేత్రస్థాయిలో అటవీ ఉన్నత అధికారులతో మాట్లాడి కేంద్రం నుండి అనుమతులు తేవడంతో విఫలం అవుతున్నారని, ఇక్కడి గ్రామాల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మా సమస్యలు తీరుస్తారని నమ్మి ఆశతో ఓట్లు వేసి నాయకులను గెలిపించడమే మా పాపమా ? ఇప్పటికే ఎన్నో సార్లు కలెక్టర్, ఎమ్మెల్యే ఎంపి లను ఆశ్రయించి అనేక మార్లు వినతి పత్రాలు అందించిన ఫలితం లేకుండా పోతుంది గత కొన్ని రోజులుగా ఇల్లు, ఊర్లను, వదిలి దీక్షను చెట్టినప్పటికీ ఎంపి, ఎమ్మెల్యేలు చిన్న చూపు చూడడం బాధ కలిగిస్తోంది. మా గ్రామాలకు దొత్తి వాగుపై వంతెన నిర్మించి ఇందిరమ్మ ఇండ్లకు అటవీ అనుమతులు మంజూరు చేసి ఆంక్షలు ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తున్నాం.



## ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాపక్షం/బాల్కొండ : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ రాజేష్ అధ్యక్షతన పర్యావరణ పరిరక్షణపై గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో పర్యావరణ పరిరక్షణ భాగంగా గ్రామాన్ని పరిశుభ్రతగా మురికివాడలలో ప్లాస్టిక్ వేయటంతో వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తుందని, ప్రతిఒక్కరూ ప్లాస్టిక్‌ను వాడకుండా గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉపసర్పంచ్ గాండ్ల రాజేందర్, పంచాయతీ కార్యదర్శి మోహన్, పాలకవర్గ సభ్యులు, ఆశావర్కర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి

ప్రజాపక్షం/భీమ్‌గల్ : మండల కేంద్రంలో శుక్రవారం ఎఐయుకెఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేసినట్లు దేవారాం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.గంగాధర్, శ్రావణ్, అశోక్, మోహన్, రాజేశ్వర్, అరవింద్, నరేష్, రాజు, లింబాద్రి, గంగామల్లు, నందునాయక్ పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడుతాయి

ప్రజాపక్షం/భీమ్‌గల్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ ఆధ్వర్యంలో 10వ వార్డు ఎస్సీ కాలనీలోని మహిళా బిల్డింగ్ ఆవరణలో మొక్కలు నాటామని కమీషనర్ గజానంద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ బోదిరె నాగమణి స్వామి హాజరై మాట్లాడారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న వారందరికి స్ఫూర్తి, భవిష్యత్తుకు, మార్గదర్శకం నేడు వాతావరణం మార్పులతో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. ఒక మొక్క నాటడం, నీటిని ఆదా చేయడం, కాలుష్యాన్ని తగ్గించటం వంటి చిన్నచిన్న చర్యలే రేపటి తరాలకు సురక్షితమైన, స్వచ్ఛమైన భూమిని అందించగలమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు నర్సయ్య, రవి, నరేందర్, సిబ్బంది సభ్యులు పాల్గొన్నారు.



## ఎన్ఎంఎంఎస్‌లో రాష్ట్ర ప్రథమ స్థానం సాధించిన పిఎంశ్రీ జడ్‌పిహెచ్ఎస్ పాఠశాల

ప్రజాపక్షం / ఖానాపూర్ : జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష ఎన్.ఎం.ఎం.ఎస్ ఫలితాల్లో పి.ఎం.శ్రీ జడ్.పి.హెచ్.ఎస్. మస్కాపూర్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. 2026 సంవత్సరానికి గాను విడుదలైన తుది ఎంపిక జాబితాలో పాఠశాల నుంచి 26 మంది విద్యార్థులు ఎంపికై తెలంగాణ రాష్ట్రంలో ప్రథమ సాథనం సాధించడం విశేషం. ఈ విజయంతో పాటు పాఠశాల మరో అరుదైన ఘనతను కూడా సొంతం చేసుకుంది. 2018 నుండి 2026 వరకు గత 8 సంవత్సరాల్లో మొత్తం 145 మంది విద్యార్థులు ఎన్.ఎం.ఎం.ఎస్‌కు ఎంపిక కావడం పాఠశాల విద్యా ప్రగతికి నిదర్శనంగా నిలిచింది. ప్రతీ సంవత్సరం విద్యార్థులను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతూ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం పాఠశాల ప్రత్యేకతగా మారింది. ఈ ఘన విజయానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు గైడ్ టీచర్ జడి శ్రీనివాస్ నాయకత్వం ఉపాధ్యాయుల సమిష్టి కృషి, తల్లిదండ్రుల సహకారం మరియు విద్యార్థుల నిరంతర శ్రమ ప్రధాన కారణాలుగా నిలిచాయి. పిఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ మస్కాపూర్ సాధించిన ఈ విజయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల సిబ్బందిని అభినందించారు.

## నీటి కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే అనీల్ జాదవ్

ప్రజాపక్షం / బోథ్ : బోథ్ మండల కేంద్రంలో 9వ వార్డులో నీటి సమస్య ఉందని వార్డు సభ్యులు వార్డు మెంబార్ రూప ప్రవీణ్ ద్వారా ఎమ్మెల్యే అనీల్‌జాదవ్ దృష్టికి తీసుకెళ్ళగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే అనీల్ జాదవ్ గ్రామంలో బోరు వేయించి నీటి కష్టాలు తీర్చారు, 9వ వార్డు సభ్యులు ఎమ్మెల్యే అనీల్ జాదవ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. బోథ్ సర్పంచ్ అన్నపూర్ణ మహేందర్ మండల ప్రధాన కార్యదర్శి రాజు మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ ప్రశాంత్, విడిసి అధ్యక్షుడు పోతన్న, గ్రంథాలయ మాజీ డైరెక్టర్ రమణాగౌడ్ బీసి అధ్యక్షులు రమణ, మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ రఫీ, సీనియర్ నాయకులు నీళ్ళ లింగా రెడ్డి, రంగు రాజు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకలు

ప్రజాపక్షం / బోథ్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బోథ్ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జూనియర్ సివిల్‌జడ్జి న్యాయమూర్తి శ్రీ కుంభ సందీప్, పొచ్చెర జలపాతం వద్ద మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ పంద్రం శంకర్, అడ్వకేట్లు కుమ్మరి విజయ్, జమీర్ అహ్మద్ ఖాన్, ఎస్ మహేష్, ఎఫ్.బి.ఓ. వసంత్ ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశంస పత్రం అందుకున్న బోథ్ నేచర్ కన్సర్వేషన్ సొసైటీ

ప్రజాపక్షం / బోథ్ : బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ అభివృద్ధి బోథ్ ప్రాంత పర్యాటక ప్రగతికి విశేష కృషి చేసినందుకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీకి ప్రశంస పత్రాన్ని జిల్లా స్థాయి అధికారి, డి.ఎఫ్.ఓ. జిల్లా ఎస్పీ చేతుల మీదుగా జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ ప్రశంసపత్రాన్ని అందుకోవడం గర్వకారణంగా ఉందని సొసైటీ సభ్యులు షేక్ అలీ, పృథ్వి తెలిపారు. బోథ్ నేచర్ కన్జర్వేషన్ సొసైటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రకృతి సంరక్షణ పర్యాటక అభివృద్ధి కోసం భవిష్యత్తులో మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు.

## బస్సులో నిఘానేత్రం

ప్రజాపక్షం / బోథ్ : ప్రభుత్వ కార్యాలయాల్లో పాఠశాలల్లో, పోలీస్ స్టేషన్లో, ఆసుపత్రులలో, పరిశ్రమలలో, ప్రజలు రద్దీగా ఉండే ప్రదేశాల్లో, నిఘా నేత్రాలు ఉండడం సర్వసాధారణం, శుక్రవారం బోథ్ నుండి ఆదిలాబాద్ వెళుతున్న బస్సులో నిఘానేత్రం ఉంది. బస్సులో నిఘానేత్రం చూసిన ప్రయాణికులు చాలా సంతోషం వ్యక్తం చేశారు. బస్సులో ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఏం జరిగిందో ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి నిఘా నేత్రాలు ర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని ప్రయాణికులు తెలిపారు.

## బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ఎనివాస్



**ప్రజాపక్షం/కోటగిరి :** కోటగిరి ఎస్సైగా నిర్మల్ టౌన్ నుండి బదిలీపై జి. శ్రీనివాస్ శుక్రవారం పదవీ బాధ్యలు చేపట్టారు. ఉమ్మడి మండలాల పరిధిలో నా వంతు కృషి చేస్తానన్నారు.

## నూతన ఎస్ఐగా సతీష్ బాధ్యతలు




**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** జిల్లా సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు కమ్మర్‌పల్లి పిఎస్‌కు నూతన ఎస్సైగా సిహెచ్ సతీష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పిఎస్ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రత పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జూదం, అక్రమ మద్యం, ర్యాస్ డ్రైవింగ్ తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు.

## మున్సిపల్ అడిషనల్ కమిషనర్‌గా చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా మున్సిపల్ కార్పోరేషన్ అడిషనల్ కమీషనర్‌గా చంద్రశేఖర్‌ను నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం చంద్రశేఖర్ మున్సిపల్ కమీషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి బాధ్యతలు చేపట్టారు.

## పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి భాధ్యత

### సర్పంచ్ కందగట్ల రాంచందర్

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సర్పంచ్ రాంచందర్ నేతృత్వంలో జిపి పాలకవర్గం, పంచాయతీ సిబ్బంది, స్థానిక నాయకులు కలిసి పర్యావరణాన్ని కాపాడుతామని గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం : పోచారం

**ప్రజాపక్షం/కోటగిరి :** ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో మండలంలోని ఎత్తొండ క్యాంపులో నూతనంగా నిర్మించిన 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు ప్రారంభించారు.

# ఫ్రీ ప్రైమరీ పాఠశాలల ప్రారంభం

**ప్రజాపక్షం/మోర్తాడ్:** తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో 20262027 విద్యా సంవత్సరానికి నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని మూడు ప్రభుత్వ ఫ్రీ ప్రైమరీ పాఠశాలను ప్రారంభించినట్లు మండల విద్యాశాఖ అధికారి డి.సమ్మిరెడ్డి తెలిపారు. ఎంపీపీ ఎస్ ఉర్దూ మీడియం మోర్తాడ్ యుపిఎస్ వడ్యాట్, ఎంపిపిప ఎస్.సుంకెట్ పాఠశాలలో ఫ్రీ ప్రైమరీ విభాగాలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో ఫ్రీ ప్రైమరీ ఇన్స్‌ట్రక్టర్ ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఫ్రీ ప్రైమరీ ఇన్స్‌ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ లేదా సమాన విద్యార్హత కలిగి ఉండాలని ప్రారంభ బాల్య విద్య లేదా ప్రాథమిక బోధనలో అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయా పోస్టుకు కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికలో మొదటి హ్యాబీటేషన్ అనంతరం గ్రామ పంచాయతీ అనంతరం మండలం, జిల్లా ప్రాతిపాదికన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటిఫికేషన్ తేది నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44సంవత్సరాల మధ్య ఉండాలని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ బీడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదు సంవత్సరాలు మాజీ సైనికులకు మూడు సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాలు వయో సడలింపు వర్తిస్తుందని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను సంబంధిత ఫ్రీ ప్రైమరీ పాఠశాలలో లేదా మండల విద్యా కార్యాలయంలో ఈ నెల 9వ తేదిలోపు సమర్పించాలని మండల విద్యాశాఖ అధికారి డి.సమ్మిరెడ్డి తెలిపారు.

## అత్యాధునిక వైద్య సేవలకు చిరునామా జిజిహెచ్ నిజామాబాద్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అత్యాధునిక వైద్య సేవలకు చిరునామాగా మారింది. జిజిహెచ్ నిజామాబాద్‌లో తొలి విజయవంతమైన పిఇసిపి (స్టెంట్) ప్రక్రియ, ప్లాస్టిక్ సర్జరీ విభాగంలోను తొలి పునర్నిర్మాణ శస్త్రచికిత్సల విజయాలతో (జిజిహెచ్) నిజామాబాద్ అత్యాధునిక వైద్య సేవలకు మరో కీలక మైలురాయిని చేరుకున్నాయి అని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. బి.వి. నాగమోహన్ అన్నారు. శుక్రవారం జిజిహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిజిహెచ్‌లోని క్యాథ్‌ల్యాబ్‌లో గతనెల మే 16న తొలి యాంజియోగ్రామ్ నిర్వహించి కేవలం 20 రోజుల వ్యవధిలోనే తొలి పిటిసిఏ (స్టెంట్) ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావడం ఆసుపత్రి చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టం అని అన్నారు. నిజామాబాద్‌కు చెందిన బురాజీ (65), గత మంగళవారం రాత్రి 10 గంటలకు తీవ్రమైన ఛాతినొప్పితో జిజిహెచ్‌కు వచ్చారు. వైద్యులు పరీక్షించి ఆయనకు అక్యూట్ మయోకార్డియల్ ఇన్ఫార్షన్ (గుండెపోటు) వచ్చినట్టు నిర్ధారించి వెంటనే కార్డియాలజీ బృందం థ్రాంబోలైసిన్ చేసి రోగిని స్థిరీకరించింది. తదుపరి గురువారం నిర్వహించిన యాంజియోగ్రామ్‌లో రైట్ కరోనరీ ఆర్టరీ లో తీవ్రమైన బ్లాకేజీ ఉన్నట్లు గుర్తించారు. అనంతరం కార్డియాలజీ విభాగ వైద్యులు



డా. సందీప్, డా. గోపీకృష్ణ, డా. రవికిరణ్‌ల బృందం విజయవంతంగా పిటిసిఏ, స్టెంట్ అమరిక నిర్వహించారని అన్నారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఇంతటి అభివృద్ధికి కారణం ఆసుపత్రి అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న ప్రభుత్వ సలహాదారు బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అందిస్తున్న సహకారం వల్లే ఇలాంటి అత్యాదునిక వైద్య సేవలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ సందర్భంగా డిప్యూటి సూపరింటెండెంట్ డా. రాములు, కార్డియాలజీ బృందాన్ని అభినందించారు. నిజామాబాద్ ప్రజలకు హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గుతోందని కార్డియాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ సర్జరీ తదితర విభాగాల్లో అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి రావడం మన అదృష్టమన్నారు.

## ఎడపల్లిలో అట్టహాసంగా మేకల సంత పారంభం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారీ మేకల సంతను స్థానిక సర్పంచ్ కందగట్ల రాంచందర్ స్థానికులతో కలిసి రిబ్బన్ కట్ చేసి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక జిపి యంత్రాంగం ఏర్పాట్లను ముమ్మరంగా పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఎడపల్లి సర్పంచ్ రాంచందర్ మాట్లాడుతూ.. ఎడపల్లి మండల కేంద్రంలో ప్రారంభమైన ఈ నూతన మేకల సంత ఇకపై ప్రతీ శుక్రవారం నాడు నిర్వహించబడుతుందని తెలిపారు. బోధన్, నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కనే ఈ వారంతపు సంతను ఏర్పాటు చేయడం వల్ల వ్యాపారస్తులకు, కొనుగోలుదారులకు ఎంతో అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. సంత ప్రాంగణం ప్రధాన రహదారిపైనే ఉండటం వల్ల గొర్రెలు, మేకల రవాణాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రవాణాకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని సర్పంచ్ వివరించారు. అంతేగాకుండా మేకల సంత వల్ల గ్రామ పంచాయతీకి తై బజార్ ద్వారా అదనపు ఆదాయం వస్తుందని, ఆ మొత్తంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని అన్నారు. ఈ మేరకు పలువురు గొర్రెలు, మేకల పెంపకందారులు, వ్యాపారులు, కొనుగోలు దారులు ఈ సంతలో అమ్మకాలు కొనుగోళ్లు కొనసాగించారు. జిల్లాలోని గొర్రెలు, మేకల పెంపకందారులు, వ్యాపారులు, కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ రజిత యాదవ్, ఉప సర్పంచ్ గంగాధర్, సొసైటీ ఛైర్మన్ పోల మల్కారెడ్డి, ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, జిపి పాలకవర్గం, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అమ్మపేరుతో మొక్క నాటండి.. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ప్రతి ఒక్కరు అమ్మ పేరుతో మొక్కలు నాటాలని, నాటిన మొక్కను సంరక్షించడం ప్రతి ఒక్కరి విధి అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శుక్రవారం స్తానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్బంగా మొక్కలు నాటి నీరుపోశారు. మొక్కలు నాటడం అంటే రాబోయే తరాలకు ఇచ్చే గొప్ప ఆస్తి అని... మొక్కలు నాటడం వల్ల ఆక్సిజన్ పుష్టిగా లబిస్తుందన్నారు.ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగమోహన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్రవంతిరెడ్డి, కార్పొరేటర్‌లు నాగోల్ల లక్ష్మి నారాయణ, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, డాక్టర్ హరీష్ స్వామి, డాక్టర్ రాఘవేంద్ర చిద్రావార్, నాయకులు మాయావార్ కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## టియులో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్ :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని టియులో జోయలుక్కాస్ జ్యువెలర్స్ నిజామాబాద్ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'మొక్కల పంపిణీ' ఘనంగా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ రాంబాబు హాజరై మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలను విరివిగా నాటాలని, ప్లాస్టిక్ సంచులను పూర్తిగా నిషేధించాలని పిలుపునిస్తూ మొక్కలను అందజేశామన్నారు. లక్కీడ్రా విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. జోయలుక్కాస్ మార్కెటింగ్ అధికారి మదన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ఆఫీసర్ డాక్టర్ అబ్దుల్ హాలీంఖాన్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఆర్‌పి క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐఐటీ మద్రాస్ ఏఐ పాఠాలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ప్రస్తుత టెక్నాలజీ యుగంలో విద్యార్థి దశ నుంచే సరికొత్త ఆలోచనలకు, ఆవిష్కరణలకు అంకురార్పణ జరిగేలా శాస్త్ర సాంకేతిక రంగాలలో శిక్షణ ఇవ్వడం ఎంతో అవసరమని ఏఆర్పీ క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రజనీకుమారి పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ఐఐటీ మద్రాస్ వారి స్కూల్ కనెక్టింగ్ ప్రోగ్రామ్ ఆన్‌లైన్ బోధనకు తమ పాఠశాల ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ ఎలక్ట్రానిక్స్ వంటి అత్యాధునిక రంగాలలో విద్యార్థులకు ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించి, వారి ఆలోచనలకు పదును పెట్టడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆమె వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సైతం అత్యాధునిక సాంకేతికతపై అవగాహన కల్పించడం వల్ల వారిలో ఉత్సాహం పెరిగి, భవిష్యత్తు ఆవిష్కరణలను తీర్చిదిద్దే గల సామార్థ్యం పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ఐఐటీ మద్రాస్ నిపుణుల ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐఐటీ మద్రాస్ వంటి ఉన్నత విద్యా సంస్థ ద్వారా నేరుగా సాంకేతిక పాఠాలు నేర్చుకునే అవకాశం రావడం పట్ల స్థానిక యువకులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## లయన్స్ క్లబ్‌కు వృద్ధురాలి నేత్రదానం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగళ్పాహడ్ గ్రామానికి చెందిన పాలకూరల పుష్పమ్మ(86) అనే వృద్ధురాలు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు కుటుంబీకులు ఆమె నేత్రాలను దానం చేయాలని లయన్స్ క్లబ్ సభ్యులకు తెలియచేయగా, బోధన్ లయన్స్ క్లబ్ ఆస్పత్రి వైద్యులు వృద్ధురాలి నేత్రాలను సేకరించారు. తమ అమ్మమ్మ నేత్రాలతో మరొకరికి చూపు కల్పించి వారి జీవితంలో వెలుగులు నింపాలని ఉద్దేశ్యంతో చేయడం జరిగిందని మృతురాలి మనవడు, లయన్స్ క్లబ్ సభ్యుడైన అరుణ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఎడపల్లి లయన్స్ క్లబ్ సభ్యులు సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేశారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**ప్రజాపక్షం/బోధన్:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ఎంతో ముఖ్యమని న్యాయమూర్తి వరూధిని అన్నారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా బోధన్ కోర్టు ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి వరూధిని మొక్కను నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైకోర్టు ఆదేశాల మేరకు అటవీ శాఖ, మున్సిపల్ శాఖ అధికారుల సహకారంతో కోర్టు ఆవరణలో పలు రకాల మొక్కలను నాటారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడేందుకు ప్రతి పౌరుడు ముందుకు రావాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకాన్ని ఉద్యమంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ, మున్సిపల్ శాఖ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.